# కళ - కలు

బావంటే నాకిష్టం!! బావ బొమ్మలంటే నాకు మరీ ఇష్టం!! కానీ బావకు మాత్రం నాకన్నా తన బొమ్మల ప్రపంచమంటేనే ఎక్కువ ఇష్టమేమో?

ఆ మాటంటే... ఒప్పుకోడు- దొంగ!! నేనంటేనూ ఇష్టమే అంటాడు.

నన్నిలా నుంచోబెట్టి అలా నుంచోబెట్టి, చెయ్యి ఇలా పెట్టమనీ, అలా పెట్టమనీ ఉత్తివేళ్లు ఏదో ముద్రలో ఫిక్స్ చేయమని బొమ్మలేస్తూండే వాడు.

మా పెళ్లి ఓ పెద్ద కథ. "ఛా! బొమ్మలేసుకునే వాడు నీకు అన్నం పెట్టలేడు" అన్నాడు నాన్న.

"నాన్న చెప్పిన మాట వినమ్మా! కళ కూడెట్టదు. ఉద్యోగం సంపాదించమను. ఆ తర్వాత పెళ్లి చేసుకుందుగానిలే" అని రహస్యంగా దుఃఖపడింది అమ్మ.

నేనేమి ఇంటర్‌కాస్ట్ మేరేజో, ఇంకోలాగో పెళ్లి చేసుకోవటం లేదు. మా బావని, చిన్నప్పటి నుండి నాతో కలిసి ఉన్నవాణ్ని, నా ఇష్టాలు తెలిసి ఉన్నవాణ్ని పెళ్లిచేసుకున్నా, వెలిపెట్టేశాడు నాన్న. ఇంక నేను ఆ ఇంటి గుమ్మం తొక్కకూడదు. నాకేం పర్లేదు అనుకున్నాను.

పట్నంలో మేమిద్దరం ప్రవేశించాం. బావ దగ్గర ఎన్ని డబ్బులున్నాయో నాకు తెలియదు. మాకు రూము దొరికింది. నాల్గో అంతస్తులో పైన వేసిన ఓ రేకుల షెడ్డు, దాంట్లో మా మకాం. ఎండకి కాస్త కష్టం కానీ, బోల్డంత విశాల ప్రాంగణంలో మా రేకులశాల పర్ణ కుటీరంలా అనిపిస్తుంది. ఒకటే గది. అందులోనే కిచెన్. మాకేం సామాన్లు ఉన్నాయి కనుక! నేను- బావ- స్కెచ్‌లు, బావ పెయింటింగ్స్, బావ బ్రష్‌లు, కలర్స్, ఇంకులు కాపురానికి వచ్చాం ఆ ఇంటిలోకి. ఇంకా బోల్డంత ఖాళీ ఉంది ఇంట్లో. నా గాజులు ఓ స్టవ్‌నీ, కొంత వంట సామానుని ఇచ్చాయి. నా జూకాలు, దుద్దులు రెండు కంచాలు, చాపా, దిళ్లూ ఇంకా కావల్సినవన్నీ ఇచ్చాయి.

బావ విజయవాడలో ఉన్న పబ్లిషర్స్‌నీ, పత్రిక ఎడిటర్లనీ తన బొమ్మలు తీసుకుని కలుస్తూనే ఉన్నాడు. రోజూ ఆశగా వెళ్లటం, నిరాశగా వెనక్కి రావటం.

మా పెద్దాళ్లు పెట్టిన శాపాలు నిజమైపోతున్నాయా? అని భయం వేస్తోంది. ఏం కాదు. వాళ్ల శాపాలు మా బావని, నన్నూ ఏం చేయవు.

బావ ఆత్మ విశ్వాసం ఒక్కోరోజు జారిపోతుండేది. నేను ధైర్యం చెప్పేదాన్ని.

ఎదురుగుండా ఉన్న కిరాణా దుకాణం ఓనరు మాకు కొన్ని రోజులు పోయాక అరువివ్వడానికి కూడా ఒప్పుకున్నాడు.

నాలుగు నెలలయింది. రాన్రానూ ధైర్యం చెప్పటం మాని, బావని

ఓదార్చవలసి వచ్చేది. నా ఒళ్లో పడుకుని కన్నీళ్లు కనిపించకుండా చీరను తడిపేవాడు. నా బాధ్యత పెరిగింది. రకరకాల భంగిమల్లో అందంగా నిలబడి నా బొమ్మ వెయ్యమనేదాన్ని. ఇద్దరికి ఆకలి వేసేది కాదు.

మేము రానురానూ రంగులకి సాంబారని, బంగాళదుంపల ఫ్రై అని, కొబ్బరి పచ్చడని, కొత్త ఆవకాయ అని పేర్లు పెట్టుకునే వాళ్లం. బొమ్మలో ఎర్రరంగు ఎక్కువయితే ఆవకాయ అదిరిందని, ఇంకోటయితే ఇంకోటని... ఇలా కడుపు నింపేసుకునే వాళ్లం. ఇప్పుడు కొత్త బొమ్మలన్నీ పట్టుకుని ఇంకాస్త ఆశ మొహానికి రాసుకుని నాచేత తల దువ్వించుకుని బావ ఉద్యోగ ప్రయత్నాలకు బయలుదేరాడు.

ఆవేళ బ్యానర్ల కంపెనీలో జాబు కోసం ఇంటర్వ్యూకి వెళ్లొచ్చాట్ట. "బొమ్మలంటే అదర కొట్టేస్తున్నావు. బ్యానర్ల దాంట్లో నీ పనేం ఉంటుంది. అక్షరాలు 'అ ఆ లు' రాని వాళ్లయినా రాస్తారు'' అని వెన్నుతట్టి వెళ్ల గొట్టారు. వాళ్లు మెచ్చుకున్నారని కొంత తృప్తి. ఉద్యోగం ఇవ్వలేదని అసంతృప్తి.

"పెళ్లి అనవసరంగా చేసుకున్నానా? నిన్ను కష్ట పెడుతున్నాను కదా సుధా!'' అని బావురుమన్నాడు ఒళ్లో పడుకుని.

నేనే బెంబేలెత్తిపోయాను. "గొప్ప గొప్ప కళాకారుల బ్రతుకులన్నీ ఇలానే మొదలవుతాయి...'' అని నాకు తెలిసున్న కథలెన్నో చెప్పాను. ఇప్పుడు కన్నీళ్లు దాచుకోవటం నాకు అవసరమైపోయింది. "మనం ఒకటి సాధించాలనుకున్నప్పుడు సాధక బాధకాలు తప్పవు. సాధన మానకూడదు. నమ్మకాన్ని వదిలి పెట్టకూడదు". బావకి తెలుసున్న మాటలే ఆరిందలా చెప్పేశాను.

"దేవుడు మనని కరుణించలేదు'' గొంతు పెగుల్చుకుని అన్నాడు బావ.

"దేవుడు మనల్ని ఎప్పుడో కరుణించాడు. నీకింత ఆర్టిచ్చాడు.

నిన్నూ, నన్నూ ఒకటి చేశాడు. ఇంకేం ఇవ్వాలో ఆయనకి తెలుసు. తప్పకుండా ఇస్తాడు. మన డ్యూటీ మనం చేస్తే ఆయన డ్యూటీ ఆయన చేస్తాడు బావా'' అని మాట మార్చడానికి "అవునూ - గ్రీన్ కలర్ అయిపోయిం దన్నావు. కొన్నావా?'' అన్నాను.

తలెత్తి చూశాడు.

కొనడానికి డబ్బులు లేనట్లు నాకు అర్థమైపోయింది.

మా కిరాణా కొట్లో అది దొరకదు. దొరికినా ఇంక అరువివ్వరు అని నాకు తెలుసు!

ఇంట్లో అప్పుడప్పుడూ మిగిలిన చిల్లర అంతా జమ చేశాను. అర్జెంటుగా గ్రీన్ కలర్ బాటిల్ తెమ్మని చెప్పాను.

పొద్దుటనగా వెళ్లాడు. ఇంకా ఇంటికి రాలేదు.

ఒంటి గంటయినా ఆరయినట్లుంది. ఆకాశంలో మబ్బులు. వర్షం వచ్చేలా ఉంది.

అమ్మో... వర్షం వస్తే - ఏ జల్లు ఎటువైపు నుంచి కొడుతుందో తెలియదు. బావ బొమ్మలు, స్కెచ్‌లు తడిసిపోకుండా గది మధ్యలో చాపకింద పెట్టాను. ఆ బొమ్మలంటే బావకు ప్రాణం. కాదు నాకు ప్రాణం. మా ఇద్దరి ప్రాణాలు దాంట్లోనే ఉన్నాయి.

బావ ఇంకా రాలేదు. వర్షం పడే లోపల ఇంటికొస్తే బావుండును. వీధి మొదట్లోనే ఉన్న హనుమంతుడి దేవాలయంలో ఘంటానాదం వినిపిస్తోంది. అంటే ప్రసాదం వేళ అన్నమాట. గబ గబా చీర మార్చుకుని గుడికి బయలుదేరాను. బావకి లంచ్ కావాలిగా. హనుమంతుడి ప్రసాదం తింటే పుణ్యం పురుషార్థమూనూ. గుళ్లో ప్రసాదం కోసం నాలాగే చాలామంది భక్తులు ఉన్నారు. పులిహోర పంపిణీ కార్యక్రమం ఆయిపోయింది. అరటి పళ్లు తీసి నా చేతిలో పెట్టారు పూజారిగారు.

నాకు నవ్వొచ్చింది. లక్కీగా రెండు ఇచ్చారు. పర్లేదులే అనుకున్నాను. గుడి ముందు అడుక్కుంటున్న ముసలి బిచ్చగత్తె మీద జాలిపడకుండా పారిపోయి వచ్చేశాను.

చిన్నగా చినుకులు మొదలవుతున్నాయి. పరుగు అవసరమే. ఇంటికొచ్చేసరికి బావ ఇంకా రాలేదు. వర్షం పెరిగింది. నిజంగా తను అనుకున్నట్లే రెండు కిటికీల్లోంచి జల్లు పడుతోంది. ఎందుకయినా మంచిదని కిటికీ తలుపుల మీద ప్లాస్టిక్ సంచులు అడ్డుపెట్టాను. తల తుడుచుకున్నాను. చాపమీద నడుం వాల్చాను. ఆకలేస్తోంది. బావకీ వేస్తూనే ఉంటుంది. త్వరగా వస్తే ఇద్దరం చెరో అరటి పండు తినేస్తే ఆకుపచ్చ రంగుతో పచ్చటి భవిష్యత్ బొమ్మ వేయించుకోవచ్చు. రేకుల మీద వాన చినుకులు టపటపా శబ్దం చేస్తూ జోకొడుతున్నాయి. సన్నగా కునుకు పట్టింది.

శబ్దం పెరిగింది. ఉలిక్కిపడి లేచాను. ఎవరో తలుపులు కొడుతున్నారు. బావే! తలుపు తెరిచాను.

జల్లులా ఘల్లున లోపలికి వచ్చి తలుపు బిగించాడు. తడిసిపోయి ముద్దయి ఉన్నాడు. వణికిపోతున్నాడు అనుకున్నాను. కానీ బావ కన్నీళ్లు కూడా వర్షం నీళ్లలో కలిసి పోయాయని అతను గొంతు విప్పి చెప్పాక తెలిసింది. తల తుడుస్తూ అతను చెప్పిన విషయం విన్నాను. ఆకుపచ్చ రంగు కొనలేదుట. ఆ డబ్బుతో అయిదు రంగు సుద్దల పేకెట్లు కొని గాంధీనగరం సెంటర్లో ఆంజనేయస్వామి బొమ్మ వేయటానికి కూర్చున్నాడు. బొమ్మ పూర్తి అయింది. అద్భుతంగా వచ్చిందట! ఇంక డబ్బులు పడటం మొదలవుతాయనగా వాన ముంచు కొచ్చిందట. బావ కల కరిగిపోయింది. కళా కరిగిపోయింది.

నాకు ఓదార్చే శక్తినియ్యి భగవాన్ అనుకుంటూ తల తుడవడం అయ్యాక నెత్తి మీద టవల్ తీశాను.

